


# సర్పశిల

## – భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

ఇప్పటివరకూ జరిగిన కథ

ఎపిసోడ్ 1: (జనవరి)

శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో 18 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.

❋❋❋

ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)

రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.

❋❋❋

ఎపిసోడ్: 3 (మార్చ్)

శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.

జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.

❋❋❋

ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్షపురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్టు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.

❋❋❋

ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.

ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.

ఎపిసోడ్ 7: (జూలై)

తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.

ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.

మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.

ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)

ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.

ప్రకృతి నాశకులు రాక్షసులు

ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.

ఎపిసోడ్ -10

అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.

తరువాయి భాగం చదవండి ...

"**అక్కడ** ఓ దట్టమైన అడవి వుంది" కళ్ళు మూసుకునే మాట్లాడుతున్నాడు రాబీ.

"ఊ" జాగ్రత్తగా వింటూ ఊ కొట్టారు పరమేశ్వర శాస్త్రిగారు.

"ఓ అమ్మవారి బొమ్మని అద్భుతంగా నేలమీద చిత్రించారు"

"ఊ"

"చీకట్లో దట్టంగా మూసుకుంటున్నాయి. మబ్బులు అతివేగంగా కమ్ముకుంటున్నాయి. ఉరుములు మెరుపులు. వందల కొద్దీ పాములు బొరియల్లోంచి బయటికి పరిగెడుతున్నాయి. ఆకాశంలోంచి ఓ రోదన ధ్వనివినిపిస్తోంది.. అదిగో.. వాడే.. వాడే" విహ్వాలంగా అరిచి వెనక్కి పడ్డాడు రాబీ వెబ్‌స్టర్.

రాబీ కోమాలోంచి సడన్‌గా బయటపడటాన్ని గమనించిన మొదటి వ్యక్తి మదాలస. ఆమె ఆ విషయాన్ని యజ్ఞప్కి తెలియబరిస్తే అందరూ రాబీ చుట్టూ గుమికూడారు. ఎవరు పిలిచినా పలుకలేదు. కళ్ళు విప్పి చూడలేదు. కానీ, మాట్లాడటం మొదలైంది. అస్పష్టంగా వినిపించిన మాటలు స్పష్టంగా వినపడసాగాయి. ఆ మాటల్ని అందరూ విన్నారు.

"మళ్ళీ స్పృహ కోల్పోయాడంటారా?" జయ్ ఆత్రుతతో అడిగాడు.

"ఈసారి స్పృహ కోల్పోవడం అనేది ఇబ్బందికరమైనది కాదు.. కానీ, అతనికి మనం ఏమీ గుర్తు తీసుకురాకూడదు. కనీసం కొన్నిరోజులపాటు"

"అతను మాట్లాడింది మీకేమైనా అర్థమయిందా?" అడిగాడు యజ్ఞప్.

"కొంత తెలుసు. నా శిష్యుడు మట్టు మరి కొందరు ప్రస్తుతం 'తలకోన'లో వున్నారు. వారున్న చోటుకి చేరడం చాలా చాలా కష్టం. వారున్న చోటు తలకోనకి కొన్ని కోసుల దూరం. చాలా దూరమైన అటవీ ప్రాంతం. నిన్న అక్కడో మహా పూజకు సంకల్పం జరిగి వుండాలి. అయ్యా, అయిదువేల సంవత్సరాలకి ఓసారి నిండు పున్నమి చిమ్మచీకటిగా మారుతుంది. కొన్ని గంటలపాటుకాదు, పూర్తి రాత్రంతా. నిన్నటి రాత్రి అటువంటిది" ఆగారు పరమేశ్వర శాస్త్రి.

"మీరు చెప్పేది నమ్మశక్యంగాలేదు" మనసులోని మాటకి చెప్పాడు సుదర్శన్.

"జయద్రధుడ్ని, అంటే సింధు దేశపు రాజు సైంధవుడ్ని హతమార్చడానికి శ్రీకృష్ణ భగవానుడు పట్ట పగల్ని రాత్రిగా మార్చలేదా?" నవ్వి అన్నారు శాస్త్రిగారు.

"ఇది వేరు కదా?" ప్రశ్నించాడు సుదర్శన్.

"ఓయీ, ఇదివేరు అనడంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"అప్పుడు పగలు చీకటిగా మారింది కొద్ది సేపేగా? అయినా, నిన్న రాత్రి పండు వెన్నెలలు చిలికే చందమామని నేను చూశాను. ఇక్కడ వుండి అక్కడ లేకుండా ఎలా పోతుందీ?" అడిగాడు సుదర్శన్.

"హ....హ అప్పుడు కూడా చీకటి కమ్మింది. కురుక్షేత్రంలో మాత్రమే. నిన్న పున్నమి చిమ్మచీకటిగా మారింది కూడా ఆ అడవిలోని కొన్ని యోజనాల మేర మాత్రమే. ఎందుకంటే ఆ చోటు చేరడం ఎవ్వరికీ సాధ్యం కాదు. కొందరు ఆటవికులు, కొందరు సిద్ధపురుషులు, కొందరు కారణ జన్ములు మాత్రమే చేరగలరు" ఆగారు శాస్త్రి.

"అది ఆ రోజుల మాట శాస్త్రిగారూ. ఇప్పుడు హెలికాప్టర్‌లో ఎక్కడైనా దిగొచ్చు. శాటిలైట్ ద్వారా దేన్నైనా గుర్తించిగమనించవచ్చు నవ్వి అన్నాడు సుదర్శన్.

"నిజమా? మరి బెర్ముడా ట్రయాంగిల్ రహస్యాన్ని విశ్లేషించారా? సముద్రంలో మునిగిపోయిన వేలాది మహా నౌకల శకలాల్ని గ్రహించగలిగారా? లక్షలమంది ప్రాణాన్ని తీస్తున్న సూక్ష్మజీవుల్నీ, గుట్టలుగా పేరుకుపోతు మానవాళిని కబళించడానికి సిద్ధంగా వున్న అణ్వాయుధాల స్టోరేజ్ శాలల్నీ గమనించారా? సుదర్శన్.. ప్రతి అంగుళానికీ యీ భూమిమీద తనదైన ఓ ప్రత్యేకత వుంది. నేను చెప్పిన చోటు ఓ అతి రహస్యమైన చోటు. కారణ జన్ములు తప్ప అక్కడికి ఎవరూ చేరలేరు. ఇది నిజం" చెప్పదలచినంతవరకే చెప్పారు శాస్త్రిగారు.

"మీరు చూశారా ఎప్పుడైనా?" అడిగాడు జయ్, వినయంగానే.

"ఉహూ! కానీ తెలుసు. ఆ ప్రదేశపు పరిసరాల్ని మట్టూ అనే నా శిష్యుడు కళ్ళకి, కట్టినట్టు వివరించాడు. ఎంత వివరంగా అంటే, అక్కడి అణువణువునీ నా మనసులో స్పష్టంగా చూడగలిగేంత" అన్నారు శాస్త్రిగారు లేస్తూ. మౌనం తాండవమాడింది.. ఆ పూటంతా.

"అయ్యా.. అటువంటి అద్భుతాన్ని నేనెక్కడా చూళ్ళేదు. అసలు చూస్తానని కూడా వూహించలేదు. చుట్టుపక్కలంతా భయంకరమైన వర్షం. కేవలం గుడి, గుడి ఆవరణలో మాత్రం ఓ పేద్ద గొడుగు పట్టినట్టుగా, చుక్క వర్షమైనా కురవలేదు. అమ్మవారి బొమ్మ చెక్కు చెదరలేదు. కనపడని 'గొడుగు' కింద దివ్యకాంతులు వెదజల్లే జ్యోతులు దివిటీల వెలుగులో అత్యద్భుతంగా 'విశ్వశాంతి' యజ్ఞం మొదలైంది. ఆ చిమ్మచీకటి నిండిన అడవిలోనించి, జడివాన కురుస్తున్న ఆ అడవిలోంచి మహా సర్పాలు బుసలు కొడుతున్న ఆ కారడవిలోనించి, ఎలా వచ్చారోమరి, ఇద్దరు సాధువులొచ్చారు. తేరిపార చూడలేని తేజస్సు వారి ముఖాల్లో వుంది. ఒకరిపేరు అలంబస భరద్వాజుడట. రెండవ వాని పేరు అరిదమన చతుర్వేదిట. వారు రాగానే అందరూ లేచి నిలబడ్డారు. చేతులు కట్టుకుని. స్వామీ, ఆయన నావంక చూసి" ఆగాడు శృంగి.

"ఆయన అంటే ఎవరు?" అడిగింది మధుర.

"అరిదమనులవారు నా వంక చూసి" మళ్ళీ ఆగాడు.

"ఊఁ.. చెప్పు" మళ్ళీ అడిగింది మధుర.

"నా వంక చూసి" మళ్ళీ ఆగి కళ్ళు మూసుకున్నాడు శృంగి ఆశ్చర్యంగా మధుర రామజోగి వంక చూసింది.

"అతను చెప్పలేడు. చెప్పే అధికారం అతనికి ఇవ్వబడలేదు. అందుకే ఎంత ప్రయత్నించినా అరిదమనుడు అన్నది అతనికి గుర్తుకురాదు" నిశ్చలంగా అన్నాడు రామజోగి.

"నేను నమ్మలేకపోతున్నా" విస్మయంతో అన్నది మధుర.

"కట్టెలు లేకుండా ఉష్ణాన్నీ, నూనె లేకుండా దీపాన్నీ, పుస్తకం లేకుండా చదువునీ వెలయించగలమని ఎప్పుడైనా అనుకున్నారా నాటి మనుషులు? అవన్నీ సాధ్యం అయినప్పుడు ఇదెందుకు సాధ్యంకాదు? ఎక్కడో ఒకచోట జరుగుతున్న మనో యుద్ధాన్ని సంజయుడు హస్తినాపురంలో కూర్చుని కళ్ళారా చూస్తూ, ధృతరాష్ట్రుడికి ఎలా వివరించగలిగాడు? మధురా.. మనిషికి అసాధ్యమైనవి అనేకం ఉండొచ్చు. కానీ కాలానికి అసాధ్యమయినది ఏదీ లేదు. సృష్టిలో అసంభవం అనుకున్నది అత్యంత సులభంగా సంభవించవచ్చు. అత్యంత సులభం అనుకున్నది అసాధ్యమూ కావొచ్చు. ముందు అతనికి

భోజనం ఏర్పాట్లు చూడు" అని శృంగీ వంక తిరిగి "శృంగీ అనవసరంగా నీ బుర్ర పాడు చేసుకోకు. హాయిగా భోజనం చేసి విశ్రమించు. ఒక్కటి నిజం. యీ సమస్య కాలానిది. కాలమే పరిష్కరిస్తుంది" నిశ్చింతగా లోపలికి వెళ్ళాడు రామజోగి.

శృంగి మనసంతా అయోమయమైపోయింది. అరిదమనుడు అన్నమాటలు ఎంత ప్రయత్నించినా ఎందుకు గుర్తుకు రావడంలేదూ? అడవి అంచునున్న గ్రామ సరిహద్దు వరకూ తనని ఓ భిల్లుడు క్షేమంగా తీసుకొచ్చి వదిలిపెట్టడం స్పష్టంగా గుర్తుంది. ఆ చిమ్మచీకటీ, వర్షమూ కూడా స్పష్టాతి స్పష్టంగా గుర్తుంది. అవునూ దీపం లేకుండాఅ దారి కనపడకుండా కొన్ని గంటలు ఆ అడవిలో ఎలా నడిచినట్టూ?" శృంగి తలనిండా ప్రశ్నలే.

రోజులు విచిత్రంగా నడుస్తున్నాయి. గాలిలో ఏదో తెలియని ఓ గాంభీర్యం. గాలి తరగలకి సయ్యాటలాడే చివురాకుల, పూల రెమ్మల్లో కూడా ఓ గాంభీర్యం. గాలి అలలలో అల్లరి తనం లేదు. క్రూరుడైన మహారాజు రాబోయే ముందు సభాసదులు భయంభయంగా ఎలా వుంటారో అలా వుంది ప్రకృతి.

"అక్కడేం జరిగి వుంటుందీ?" అరిగింది మధుర.

"నాకు తెలుసు.. తెలీదు. తెలుసంటే తెలుసు. ఎలా అని అడక్కు. వర్షాగమనం నెమళ్ళకి తెలుసు. తుమ్మెదల ఝుంకారం పువ్వలకి తెలుసు. ప్రాణం పోకడ మృత్యువుకి తెలుసు. అలాగే, నాకూ కొంత తెలుసు" ఓ క్షణం ఆగాడు రామజోగి.

"ఆ కొంత తెలియడమూ నా ప్రజ్ఞకాదు. నా జీవ లక్షణం. మధురా.. ఈ ప్రపంచంలోని సర్వజీవుల్లోనూ ఉండేది ఒకే చైతన్యం. చైతన్యం ఒకటే అయినా దేని జీవలక్షణం దానిదే ఓ కప్పలోనూ, పాములోనూ గద్దలోనూ ఉన్న చైతన్యం ఒక్కటే. వాటిని బ్రతికించే శ్వాసా ఒక్కటే, కానీ, అవి వేరు. కప్పని పాము, పాముని గద్దా మింగేస్తాయి. అంటే ఒక చైతన్యం మరో చైతన్యాన్ని మింగేస్తోంది. ఎందువల్ల? జీవం ఒకటైనా, జీవలక్షణం వేరు. మళ్ళీ ఆగాడు రామజోగి. కొన్ని నిముషాలు నిశ్శబ్దం వూగులాడింది.

"నా చిన్నతనం నించి నన్ను ముందుకు నడిపించినవి కలలే. అది కలలా అంటే కలలు. కావా అంటే కావు. ఎందుకు కావూ అంటే ఆ కలలు నిజంగా జరుగుతున్నంత గాఢంగా వుండేవి. ప్రతి కలా మనసులో ముద్రించుకుపోయింది. ఈ శృంగిని నా అయిదో ఏట ఓ కలలో చూశా. ఇతని తండ్రి చనిపోతే తల్లి ఇతన్ని మా అమ్మ చేతిలో పెట్టి వెళ్ళిపోయింది. ఇతను నా దగ్గర నా శిష్యుడులా ఎందుకుండాలీ? ఇతనికి గురువు కాగలిగినంత వయసు నాది కాదే. కానీ ఇతడు నాతోనే ఉండాలి. మనందరం ఓ మహా చైతన్య ప్రవాహంలో కొట్టుకుపోతున్న కట్టెలం. గమ్యమూ గమనమూ రెండూ మన చేతిలో లేవు."

మళ్ళీ ఆగాడు రామజోగి. వరండాలో కూర్చున్న శృంగికి కూడా రామజోగి మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి. రామజోగి మధురతో మాట్లాడుతున్నట్టు శృంగికి అనిపించలేదు. తనలో తను మాట్లాడుతున్నట్టుంది.

"ఒక విధంగా చెబితే, పువ్వు పిందెగా, కాయగా పండుగా, మళ్ళీ విత్తనంగా రూపు మార్చుకుంటున్నట్టు మనం కూడా జన్మకొసారి రూప, నామాల్ని మార్చుకుంటూనే వస్తున్నాం. రుతువులు మారినా కాలం మారదుగా. మార్పులన్నీ ప్రకృతిలోనే .. ప్రకృతికీ సృష్టికీ మూలాధారమైన ఆకాశంలో కాదు. ఒకే నాటకం అనేకసార్లు ప్రదర్శింపబడినట్టు, ఒకే స్వరం అనేక పాటలు పాడినట్టు, ఒకే తూర్పు సూర్యుడ్ని మళ్ళీ మళ్ళీ ఉదయాన్నే ప్రసవించినట్టు మనం కూడా మన పాత్రల్ని మళ్ళీ మళ్ళీ పోషిస్తూనే ఉన్నాం. ఈ ఆలోచన తెగదు. ఎందుకంటే, దీనికి సమాధానం చెప్పగలిగేవారో, చివురాకు

సుడిగాలిలో వూగుతున్నట్టు విహ్వలంగా కదులుతున్న మనసులోని ఆలోచనలను కూడా సమాధానపెట్టగల వారో రావాలి. అంతవరకూ మౌనమే శరణ్యం" లేచాడు రామజోగి. కదలకుండా కూర్చుంది మధుర. కదలాలన్నా కదలలేక అక్కడే కూర్చుండిపోయాడు శృంగి.

తక్కున లేచి కూర్చున్నాడు రాబర్ట్ వెబ్‌స్టర్.

"అవిగో.. అవి పాండవుల ఆయుధాలు. ధగధగలాడుతున్నై. భూమిని పెకలించుకు రావాలని దారి వెతుకుతున్నై.. అదిగో శ్రీకృష్ణుడి సుదర్శన చక్రం విశ్వాన్ని తనలో ఇముడ్చుకుని కాలాన్ని తనతో తిప్పుతోంది. అవిగో... అస్త్రాలు. వజ్రకాంతితో మెరిసిపోతున్నై. ఓయ్... వాటి వెలుగు కళ్ళకి మిరుమిట్లు గొలుపుతోంది.

ఎవరా నృత్యాలు చేసేది. ఎవరూ ఆ భేరీలు మోగించేది. ఎవరూ చెవులు పగిలేట్టు వందల శంఖాల్ని పూరిస్తున్నది. మెరుపు వేగంతో వెడుతున్న ఆ రథం ఎవరిది. అందులో వున్నది కృష్ణార్జునులా స్వామీ వరదరాజా. నా తల తిరిగిపోతోంది. ఈ దృశ్యాన్ని చూసే శక్తి నాలో తగ్గిపోతోంది స్వామీ. వేలాది రాబందులు రెక్కల్ని టపటపలాడిస్తూ ఎగురుతున్నాయి.. యజ్ఞ వాటిలోనించి వచ్చే ధూపంతో కొండలు నిండిపోతున్నాయి. పరాత్పరా, పరమేశ్వరా స్వచ్ఛమైన తెలుగులో అరిచి మూర్ఛపోయాడు రాబీ.

"పాండవుల ఆయుధాలా? మహా భారత దృశ్యాలా? శాస్త్రిగారూ ఓ అమెరికన్ స్వచ్ఛమైన తెలుగు మాట్లాడటమా?" ఆశ్చర్యంగా అన్నాడు యజ్ఞప్ప.

"ఇది ఓ మహా ప్రళయానికో, ప్రళయాన్ని తప్పించడానికో సూచన. ఇప్పటికి తెలిసింది ఇంతే" నిట్టూర్చారు పరమేశ్వర శాస్త్రిగారు.

Post your comments

*(కొనసాగింపు వచ్చే నెలలో)*